

సాక్షి వికారాబాద్

శనివారం । 6 ఏప్రిల్ । 2024



జోరుగా ఇసుక దందా

పెద్దేముల్ మండలంలో ఇసుక అక్రమ దందా జోరందుకుంది. అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. 10లో▸



పాతది వదిలేసి..

నిజాం కాలం నాటి వసతి గృహాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో అది శిథిలావస్థకు చేరింది. 11లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శనివారం సాయంత్రం 6:36	ఆదివారం ఉదయం 4:43

న్యూస్‌రీల్

స్నేహితులతో వెళ్లి.. శవమై తేలి

- జెట్టూరు చెక్‌డ్యాంలో అల్లాపూర్ యువకుడి అనుమానాస్పద మృతి
- సులైపేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు



రమేశ్ (ఫైల్)

బషీరాబాద్: స్నేహితులతో కలిసి సరదాగా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కర్ణాటక పరిధిలోని చెక్‌డ్యాంలో శవమై తేలాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని అల్లాపూర్‌కు చెందిన రుద్రారం రమేశ్(30) జెట్టూరు చెక్‌డ్యాంలో శవమై కనిపించాడు. ఇతను కొన్నేళ్లుగా భార్య, పిల్లలతో కలిసి విజయవాడలో ఉంటున్నాడు. మిత్రుడి వివాహం సందర్భంగా గురువారం గ్రామానికి వచ్చాడు. పెళ్లి అనంతరం స్నేహితులతో కలిసి ఈత కోసం బయటకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని ఆరా తీశారు. శుక్రవారం ఉదయం జెట్టూరు శివారులోని చెక్ డ్యాంలో శవమై తేలాడని తెలుసుకుని.. మృతదేహాన్ని వెలికితీసి అల్లాపూర్‌కు తరలించారు. అయితే రమేశ్‌తో పాటు ఎవరెవరు వెళ్లారు..? ఈతకు దిగి నీట మునిగాడా..? మరే కోణమైనా ఉందా అనే విషయాలు తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా రమేశ్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని భార్య తరఫు బంధువులు కర్ణాటకలోని సులైపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ అనుమానస్పద మృతిగా కేసు నమోదైంది. కొడుకు మృతితో తల్లి సత్యమ్మ, భార్య, కుటుంబీకులు బోరున విలపించారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

కేశంపేట: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని కూలీలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని బోధునంపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. అనంతరం వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందించారు. వేసవిలో ఎండ వేడిమి నుంచి జాగ్రత్త ఉంటూ పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం లేమామిడి, కొండారెడ్డిపల్లి, అల్వాల గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీచరణ్ గౌతమ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏపీఓ అజీజ్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మేక్ ఇండియా విప్లవంలో ముందుండాలి

తుక్కుగూడ: రాష్ట్రంలోని సూక్ష్మ, స్థూల పరిశ్రమలు మేక్ ఇండియా విప్లవంలో ముందుండాలని రాష్ట్ర ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. తుక్కుగూడ ఈ–సిటీలో ప్రముఖ స్వదేశీ ఆడియో ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ మివి ఆవిష్కరన్ పరిశ్రమ ఏర్పాటుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. టీఎస్‌ఐఐసీ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఆడియో రంగంలో ఏకైక తయారీ సంస్థగా మివి కంపెనీ వెలుగొందుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మివి సీఎంఓ మిథుల దేవాబతుని, కో ఫౌండర్ కె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్‌కు అలవాటు పడి తండ్రిని అతిదారుణంగా హత్య చేసిన కొడుకును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలిస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరెంజ్ అవెన్యూలో నివసించే తిరుపతి రవీందర్‌ను కన్న కొడుకు అనురాగ్ పెట్రోల్‌పోసి నిప్పంటించి, రాయితో మోది చంపిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న అనురాగ్‌ను ఆదిబట్ల పోలీసులు హైదరాబాద్‌లో పట్టుకుని అరెస్టు చేసి శుక్రవారం ఇబ్రహీంపట్నం కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. తండ్రి పట్టించుకోకపోవడంతోనే హతమార్చినట్లు పోలీసుల విచారణలో తెలిపినట్లు తెలిసింది.



చిన్న శేష వాహనంపై విహరిస్తున్న స్వామివారు



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు



పెద్ద శేష వాహనంపై శ్రీవారు

చిన్న శేష వాహనంపై శ్రీవారు

పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి శుక్రవారం చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉత్సవమూర్తులను అందంగా ముస్తాబు చేశారు. భక్తుల దర్శనార్థం ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అభిషేకం చేశారు. సుగంధ ద్రవ్యాలతో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి స్వామివారు పెద్ద శేష వాహనంపై అనంత పద్మనాభ స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. – కొడంగల్

జనజాతరకు రెడీ

అన్ని దారులూ తుక్కుగూడ వైపే..

- ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా ప్రముఖుల రాక
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న పార్టీ శ్రేణులు
- పూర్తయిన ఏర్పాట్లు.. భారీ బందోబస్తు
- సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఆంక్షలు
- సభాస్థలిని సందర్శించిన దీపాదాస్ మున్షి, మంత్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జన జాతరకు సర్వం సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా శనివారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన సభను టీపీసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీ, ఖర్గే సహా ఇతర ముఖ్య నేతలంతా హాజరుకానుండడంతో భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సెప్టెంబర్ 17న ఇదే వేదిక నుంచి ఆరు గ్యారంటీలను ప్రకటించించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చిన తుక్కుగూడను జాతీయ ఎన్నికల శంఖారావానికి వేదికగా చేసుకుంది. ఈ వేదిక నుంచే జాతీయ స్థాయిలో ఐదు గ్యారంటీలను ప్రకటించనుంది. సభకు ఏఐసీసీ ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు హాజరవుతుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సుమారు 500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. ఇటు శంషాబాద్ నుంచి ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ 14 వరకు.. అటు పహడీషరీఫ్ నుంచి తుక్కుగూడ శివారు వరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డు సహా శ్రీశైలం జాతీయ రహదారిపై సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు.



సిద్ధమైన సభావేదిక

సభాస్థలిని సందర్శించిన దీపాదాస్ మున్షీ

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి తరలి వచ్చే వారికి ఆహ్వానం పలికేందుకు నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం మొదలు.. నార్సింగి, రాజేంద్రనగర్, తుక్కుగూడ, రావిర్యాల, కొంగరకలాన్, బొంగ్లూరు జంక్షన్ సహా శ్రీశైలం, నాగార్జునసాగర్, విజయవాడ జాతీయ రహదారుల వెంట భారీగా కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. దారి పొడవునా కాంగ్రెస్ జెండాలు, తోరణాలు కట్టారు. వడదెబ్బబారిన పడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే సీఎం రేవంత్ సహా మంత్రులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తాజాగా శుక్రవారం పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు, మాజీ ఎంపీ రాజయ్య, ఎంపీ డాక్టర్‌జి.రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి తదితరులు సభాస్థలిని సందర్శించారు.

సభను విజయవంతం చేయండి

జనజాతర భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల ఎంపీ, పార్టీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్‌జి.రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తుక్కుగూడ సభాస్థలిని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకుం కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ గడ్డమీద నుంచి కాంగ్రెస్ పార్టీ 'జంగ్ సైరన్' మోగించనుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ 14 స్థానాలు గెలుస్తుందని.. చేవెళ్లలో బంపర్‌మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.



సభా ప్రాంగణం వద్ద నేతల కటౌట్లు

పెద్ద ఎత్తున ఏర్పాట్లు

ఫ్యాబ్‌సిటీకి వెళ్లే మార్గంలో ఖాళీగా ఉన్న 25 ఎకరాల విస్తీర్ణంలో భారీ ప్రధాన వేదికను ఏర్పాటు చేశారు. దానికి ఇరువైపులా మరో రెండు వేదికలను సిద్ధం చేశారు. పూర్తిగా ఓపెన్ ఎయిర్ స్టేజీలను ఏర్పాటు చేశారు. ప్రధాన వేదికపై ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ఖర్గే, ప్రియాంకగాంధీ సహా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఆసీనులు కానున్నారు. ముఖ్య నేతలతో పాటు మంత్రులు పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రధాన వేదికకు ఎడమ వైపు ఉన్న స్టేజీని కళాకారులకు, కుడివైపు ఉన్న వేదికను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులకు కేటాయించారు. వేదిక వెనుక భాగంలో భారీ ఎల్‌సీడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. వేదిక ముందు భాగంలో నాలుగు గ్యాలరీలను ప్రత్యేకంగా మహిళల కోసం కేటాయించారు. సభాస్థలికి వచ్చి వెళ్లే ప్రధాన మార్గాలతో పాటు వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాల్లోనూ లైటింగ్, సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు.

మళ్లీ మాదే అధికారం

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలి
- బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం/మర్పల్లి: కేంద్రంలో మళ్లీ మాదే అధికారమని, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. కల్లబొల్లి మాటలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడే దివాలా తీసిందన్నారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రం నిధుల తోనేనని గుర్తుచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఆయన గ్రామాల్లోకి వస్తే దాణా స్కాం, భూ కబ్జాలపై నిలదీయాలన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రధాని నరేంద్ర మోదీ తోనే సాధ్యమైందన్నారు. తనను భారీ మెజారీతో గెలిపిస్తే చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తన హయాంలోనే అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు కే మాధవరెడ్డి, సీనియర్ నాయకులు శివరాజ్, పాండుగౌడ్, విజయ్ భాస్కర్‌రెడ్డి, కేపీ రాజు, వెంకటేశం గౌడ్, రాజేందర్‌రెడ్డి, బుస్స శ్రీకాంత్, వివేకానందరెడ్డి, శివకుమార్, కృష్ణాయాదవ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న పీఎం

మర్పల్లి: కరోనా వచ్చిన నాటి నుంచి ప్రధాని మోదీ పేద ప్రజలకు అండగా నిలిచారని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఐదేళ్లుగా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తూ పేదల ఆకలి తీరుస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ కల్‌ఖోడ, దామస్తాపూర్, బూచన్‌పల్లి, పట్లూర్, పంచలింగాల గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి తమను ఆశీర్వదించాలని కోరారు. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సహాయ కార్యదర్శి మల్లేశ్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్, పార్టీ మండల అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మధుకర్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ, నాయకులు శ్రీధర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, బలరాంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: రొంపల్లి ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రైతులను ఆదుకోవడంలో విఫలం

ఇబ్రహీంపట్నం రూరల్: కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. వారిని ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి బొక్క నర్సింహారెడ్డితోపాటు మాజీ ఎంపీ, పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కిసాన్‌మోర్చా జాతీయ నాయకులు పాపయ్యగౌడ్, అంజయ్య యాదవ్ హాజరయ్యారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

తుర్కయంజాల్: దేశంలోని కార్మికచట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా మార్చి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. వీరయ్య విమర్శించారు. నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో దేశంలోని సగం జనాభా దారిద్ర్యరేఖకు దిగువనే ఉండటం బీజేపీ పాలనకు నిదర్శనం అని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అనేక కార్పొరేట్ కంపెనీల నుంచి కోట్ల రూపాయలను ఆ పార్టీ దండుకుందని ఆరోపించారు. అవినీతి అక్రమాలకు పాల్పడ్డ అందరినీ శిక్షించకుండా బీజేపీలో చేరిన వారిని వదిలి పెడుతూ మిగిలిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కార్మికులంతా ప్రస్తుత రాజకీయ పరిస్థితులను తెలుసుకుని దానికి అనుగుణంగా నడవాలని సూచించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి చంద్రమోహన్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు రుద్రకుమార్, రవికుమార్, నర్సిరెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

- ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే వ్యాపారాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు



పరిగి మున్సిపల్ కార్యాలయం

పరిగి: ఆదాయం తెచ్చే అంశాలను అధికారులు విస్మరిస్తుండటంతో పరిగి పురపాలక సంఘం రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. పట్టణ పరిధిలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ కార్యకలాపాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. చిన్న కిల్లీ కొట్టు నుంచి పెద్ద షాపింగ్ మాల్స్, కార్పొరేట్ స్థాయి సంస్థల వరకు కచ్చితంగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని నిబంధన ఉంది. కానీ చాలా వ్యాపార సముదాయాలు లైసెన్స్‌లు తీసుకోకపోవడం, ఏటా ఫీజులు చెల్లించకుండా ఎగవేస్తున్నాయి. ఇందులో పెద్ద ఎత్తున రోజుకు రూ.లక్షల్లో లావాదేవీలు చేసే వ్యాపార సంస్థలున్నాయి. షాపింగ్‌మాల్స్, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, కార్పొరేట్ స్కూల్స్, పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు వంటివి ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోకుండా మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు.

అనుమతులు 178 మాత్రమే

పరిగి పట్టణ కేంద్రంలో అన్ని వ్యాపారాలు కలిపి వేల సంఖ్యలో ఉన్నప్పటికీ కేవలం 178 మంది వ్యాపారస్తులు మాత్రమే ట్రేడింగ్ లైసెన్సును తీసుకున్నారు. వ్యాపార లావాదేవీలు నిర్వహించే ప్రతి సంస్థ ట్రేడ్ లైసెన్స్ తీసుకుని తమ లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం గల్లీలో ఉండే పాన్ షాపు నుంచి పెద్ద పరిశ్రమల వరకు ప్రతీ వ్యాపారస్తుడు లైసెన్స్ తీసుకోవాలి. ఇందుకోసం ఆ షాపు ఉన్న రోడ్డును బట్టి ఫీజును నిర్ణయిస్తుంటాయి. సింగిల్, డబుల్ లైన్ రోడ్డు పరిధి వ్యాపారాలు ఏర్పాటైన స్థలాన్ని బట్టి విలువ లెక్కించి ఫీజులు కట్టాల్సి ఉంటుంది. 20 ఫీట్ల రోడ్డుకు ఒక చదరపు అడుగుకు కనీసం ఫీజు రూ.3, డబుల్ రోడ్డు రూ.4.. హోటళ్లకు, ఆస్పత్రులకు రూ.6 చొప్పున వసూలు చేయాలి. మున్సిపాలిటీ పరిధిలోని పరిశ్రమలకు మరో విధంగా ఫీజును నిర్ణయిస్తారు. కానీ వ్యాపార నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండా, తీసుకున్న వాటిని రెన్యూవల్ చేయకుండా ఉంటున్నారు.

అంతంత మాత్రంగా రెన్యూవల్

ట్రేడ్ లైసెన్స్ జారీ ఒక ఏడాదికి మాత్రమే ఉంటుంది. గడువు ముగిస్తే మళ్లీ పునరుద్ధరించుకోవాలి. ఇందులో తాత్కాలిక, శాశ్వత విభాగాల్లో లైసెన్సులు ఉంటాయి. రోజూ రూ.లక్షల్లో లావాదేవీలు సాగించే వందల చదరపు అడుగుల్లో విస్తరించిన విద్య, వైద్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, షోరూం, వస్త్ర, ఎలక్ట్రికల్స్ తదితర వ్యాపారస్తులు లైసెన్స్‌లను విస్మరిస్తున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లైసెన్స్‌లు తీసుకోవడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. చిన్న చిన్న వ్యాపారులే ఏటా అధికంగా ట్రేడ్ లైసెన్సులు తీసుకుంటున్నారు. కానీ బడా వ్యాపారస్తులు మాత్రం ఎగవేస్తున్నారు. దీంతో పురపాలికకు రావాల్సిన ఆదాయం రాక నష్టం వాటిల్లుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న లైసెన్సుల్లోను చాలా వరకు విలువకు తగినట్టుగా మదింపు సరిగా జరగడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

క్లుప్తంగా

పేదల పాలిట వరం సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



బాధిత కుటుంబ సభ్యుడికి ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: పేదల పాలిట వరంగా సీఎం రిలీఫ్ ఫండ్ ఉందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామానికి చెందిన రాచమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వారి కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.1.10 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి వారికి అండగా నిలిచేందుకు సీఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే అన్నారు.

ఎస్సీ నిరుద్యోగులకు గ్రూప్స్ ఉచిత శిక్షణ

అనంతగిరి: జిల్లాలోని గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీయన్ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న వివిధ ఉద్యోగాల నియామక ప్రక్రియలో భాగంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన 100 మంది ఎస్సీ నిరుద్యోగులకు గ్రూప్స్ కోసం మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. కోచింగ్‌ను నిష్ణాతులైన అధ్యాపకులచే ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తారని తెలిపా రు. కోచింగ్ సమయంలో హాస్టల్, భోజన వసతితో పాటు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 70132 00133 నంబర్‌ని సంప్రదించాలని వివరించారు.

వీరశైవ లింగాయత్ సంఘం పట్టణ కార్యవర్గం ఎన్నిక

తాండూరు టౌన్: వీరశైవ లింగాయత్, లింగబలిజ సంఘం తాండూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పటేల్ ఉదయ్ శంకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు వీరేశం శుక్రవారం ప్రకటించారు. తాండూరు పట్టణ గౌరవాధ్యక్షుడిగా ఎద్రామి బసనప్ప, అధ్యక్షుడిగా గాజుల వీర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా శరణుబసప్ప, తుప్పుడు శేఖర్, అల్వారి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా పటేల్ విజయ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లికార్జున్, సహ కార్యదర్శులుగా అల్లం మల్లికార్జున్, గాజుల కమలాకర్, కాసాల నరేందర్, కోశాధికారిగా మేడి విజయ భాస్కర్, న్యాయ సలహాదారులుగా శరత్ చంద్ర, కార్యవర్గ సభ్యులుగా గాజుల బస్వరాజ్, సిద్రామప్ప, రాచప్ప, రాజేంద్రప్ప, బస్వరాజ్, వీరన్నలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు వీరప్రసాద్, పటేల్ విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్, లింగ బలిజల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు.

రూ.2.10 లక్షలు పట్టివేత



పట్టుబడ్డ నగదుతో పోలీసులు

దౌల్తాబాద్: మండలంలోని చంద్రకల్ గ్రామం వద్ద ఉన్న చెక్‌పోస్టు దగ్గర పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం షాపూర్ నుంచి మన్నెగూడ వెళ్తున్న కారులో రూ.2.10 లక్షల నగదును పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల: అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాసానిగూడ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ద్యావరి రాములు(35) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బావిలో రాములు శవమై తేలాడు. అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది బావిలో దూకి మృతి చెందినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జోరుగా ఇసుక అక్రమ దందా

- రుక్మాపూర్– బిజ్వారం వాగుల నుంచి తరలింపు
- పట్టపగలే రోడ్లపై ఇసుక ట్రాక్టర్‌లు
- పట్టించుకోని పోలీస్, రెవెన్యూ అధికారులు



పెద్దేముల్ మండలంలో జనగాం మీదుగా ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక (ఫైల్)

పెద్దేముల్: అక్రమ ఇసుక వ్యాపారం మండలంలో జోరందుకుంది. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా అధికారుల అండదండలతో రాత్రి, పగలు అనే తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక దళారులు అధికారుల సహకారం, రాజకీయ పలుకుబడితో నిర్వహిస్తున్నారు. దీనిపై పోలీస్, మండల అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. వాగుల్లో రోజంతా ఇసుకను కుప్పలు పోసి సాయంత్రం, ఉదయం, రాత్రి వేళల్లో గ్రామాలకు ట్రాక్టర్‌ల ద్వారా తరలిస్తున్నారు. ముఖ్యంగా మండలంలో మన్‌సాన్‌పల్లి, రుక్మాపూర్, యాలాల మండలంలో బిజ్వారం వాగుల నుంచి అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతుంది.

నామమాత్రంగా దాడులు

పత్రికల్లో వచ్చిన సమయంలో నామమాత్రంగా పోలీసులు, అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఈ అక్రమ దందాలో అధికారుల వాటా ఎంతని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమ ఇసుక అరికట్టాలని ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఒకటి, రెండు రోజులు సెలవులు వస్తే చాలు అక్రమ ఇసుక ట్రాక్టర్‌లకు అదుపు లేకుండా పోతుంది. ఫిర్యాదు చేసిన సమయంలో అధికారులు ఒక ట్రాక్టర్ పట్టుకోవడం, మిగతా ట్రాక్టర్లను వదలటం పరిపాటిగా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సీజ్ చేసినా ఆగని వ్యాపారం

పది రోజుల క్రితం పోలీసులు అక్రమ ఇసుక ట్రాక్టర్‌లకు పట్టుకొని కేసులు పెట్టారు. రూ.5 వేలు జరిమానా కట్టి మళ్లీ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఒకటి, రెండు కంటే ఎక్కువ సార్లు దొరికితే అట్టి ట్రాక్టర్‌లను సీజ్ చేయాలి. కానీ పెద్దేముల్ పోలీసులు పట్టుకోవడం, వదలటం షరా మామూలైంది. గత నెల పదిహేను రోజుల నుంచి మారేపల్లి, కందనెల్లి, పెద్దేముల్, మారేపల్లి మీదుగా అక్రమ ఇసుక జోరుగా సాగుతుంది. ప్రస్తుతం దగ్గరలో ఉంటే రూ.4 వేల నుంచి రూ.5వేలకు ఒక్కో ట్రాక్టర్‌కు తీసుకొని కాసుల దండుకుంటున్నారు. మండలంలో 9 నెలల నుంచి యథేచ్ఛగా అక్రమ ఇసుక వ్యాపారం కొనసాగుతుంది.

అడ్డాగా మంబాపూర్

అక్రమ ఇసుక వ్యాపారస్తులకు మంబాపూర్ అడ్డగా మారింది. మన్‌సాన్‌పల్లి, బిజ్వారం, రెగోండి గ్రామాల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్‌లు మంబాపూర్ మీదుగా అధికంగా కోటపల్లి, బండమీదిపల్లి, బార్వాద్‌తో పాటు పలు గ్రామాలకు వెళుతాయి. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అక్రమ ఇసుక వ్యాపారం కొనసాగిస్తారు. అంతే కాకుండా కాగ్నా పరివాహక ప్రాంతంగా ఉన్న మదనంతాపూర్, రెగోండి, రుక్మాపూర్, ఖాంజాపూర్, కందనెల్లి ప్రాంతాలల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వాగుల సమీపంలోని పొలాల్లో కూలీలకు వ్యాపారస్తులు స్థావరాలు ఏర్పాటు చేసి దందా నిర్వహిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



అక్రమంగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్‌లను పట్టుకొని కేసులు నమోదు చేస్తాం. అక్రమ ఇసుక నిల్వలు ఎక్కడైనా ఉంటే పూర్తి సమాచారం ఇచ్చిన గంటలో సీజ్ చేస్తాం. రుక్మాపూర్, బిజ్వారం గ్రామాల వాగుల నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న సమాచారం వచ్చింది. అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– గిరి, ఎస్‌ఐ, పెద్దేముల్

ప్రతిఒక్కరికీ దైవభక్తి ఉండాలి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్

మర్పల్లి: ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల పరిధిలోని బూచన్‌పల్లి గ్రామంలో బక్కప్పప్రభు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువారం అర్ధరాత్రి నిర్వహించిన రథోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన హిందూ సాంప్రదాయ పండుగలు ప్రపంచ దేశాలలోనే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. హనుమాన్ ఆలయం నుంచి బక్కప్పప్రభు మందిరం వరకు రెండు కిలో మీటర్ల వరకు భజన కార్యక్రమాలతో రథోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పూజా కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాలలో నాయకులు వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, రఘుపతిరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి

పరిగి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మార్కెట్‌యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుందన్నారు. ప్రస్తుతం వరి క్వింటాలుకు ఏగ్రేడ్ రూ.2,203, బిగ్రేడ్ రూ.2,183గా నిర్ణయించిందన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ధాన్యాన్ని రైతులు బాగా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వారం పది రోజుల్లోనే ఖాతాలో డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ అధికారులు

అవినీతిరహిత పాలన బీజేపీతో సాధ్యం



కామునిపల్లిలో ఇంటింటి ప్రచారంలో నాయకులు

పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: అవినీతిరహిత పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. శుక్రవారం చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కుటుంబీకులు మీరారెడ్డి తదితరులతో కలిసి ఆయన మండల పరిధిలోని కామునిపల్లి, పీరంపల్లి, కుల్కచర్ల గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సుభిక్షమైన పాలన కొనసాగాలంటే మళ్లీ మనందరం బీజేపీకే ఓటు వేయాలన్నారు. దేశంలో కుటుంబ పాలనకు అవకాశం ఇవ్వొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, సామ్యారెడ్డి, వెంకటయ్య, నర్సింహారెడ్డి, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎండలతో అప్రమత్తత ముఖ్యం



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

పెద్దేముల్: ఎండల తీవ్రతతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరమైతేనే బయటకు రావాలని పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సూచించారు. శుక్రవారం మండలంలోని మంబాపూర్, పెద్దేముల్, ఇందూరు, మారేపల్లి, తట్టెపల్లి, అడ్కిచెర్ల, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వ్యవసాయ పొలాల వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఎండల తీవ్రతపై అవగాహన నిర్వహించారు. ఉదయం వెళ్లిన కూలీలు ఎండలు జోరందుకున్న సమయానికి ముందే ఇళ్లకు చేరుకోవాలన్నారు. అత్యవసర సమయంలో తప్ప మిగతా వేళల్లో బయటకు రావొద్దన్నారు. ఎండల బారి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బకు ఎవరూ గురి కావొద్దన్నారు. రోడ్ల వెంట విక్రయించే రంగులతో కూడిన శీతల పానియాలకు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలని వైద్యులు సూచించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు జ్వర మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలిరండి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నేడు నిర్వహించే సభకు తాండూరు నియోజకవర్గం నుంచి వేలాది మంది తరలిరావాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానంతో ఇతర పార్టీల నుంచి నాయకులు పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. జన జాతరకు అగ్రనేతలు పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటిస్తారన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామానికి బస్సు అందుబాటులో ఉంటుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

తాండూరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌గౌడ్ శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దకాలం పాటు పని చేయడం పట్ల సంతోష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. రానున్న రోజుల్లో పనితీరును బట్టే స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే అన్నారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సంతోష్‌గౌడ్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన శుక్రవారం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. సుమారు 48 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి పక్కన ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు తెల్లని షర్టు, బ్రౌన్ కలర్ ఫ్యాంట్, ఎర్రని చెప్పులు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుత్ వైర్ల దొంగ అరెస్టు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బోరు మోటార్ల సర్వీస్ వైర్ల చోరీకి పాల్పడిన ఓ దొంగను గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆకులమైలారం తదితర గ్రామాల్లో నాలుగు రోజుల కిందట కందుకూర్ మండలం తుమ్మలూర్ గ్రామానికి చెందిన జంగారెడ్డి అర్ధరాత్రి వేళ బోరుబావుల మోటార్ల వైర్ చోరీకి పాల్పడుతున్నాడు. ఆ సమయంలో ఆయన తన బైక్‌ను రోడ్డుపై వదిలి వెళ్లగా రైతులు ఫొటో తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసి చోరీకి పాల్పడిన జంగారెడ్డిని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రిమాండ్‌కు పంపనున్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నర్సింహారావు తెలిపారు.

దాడి ఘటనలో నిందితులకు రిమాండ్

చర్లపల్లి జైలుకు తరలింపు

కడ్తాల్: పాత కక్ష్యలు మనస్సులో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరు నిందితులను రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పెద్దవేములోనిబావి తండాకు చెందిన రమావత్ దేవ్యా అలియాస్ దేవ్, గడ్డమీదితండాకు చెందిన విస్లావత్ మల్లేశ్‌కు.. పెద్దవేములోని బావితండాకు చెందిన రమావత్ రాజేందర్‌తో గతంలో పలుమార్లు గొడవలు జరిగాయి. అవి మనస్సులో పెట్టుకున్న దేవ్, మల్లేశ్.. ఈ యేడాది ఫిబ్రవరి 27న రాజేందర్‌పై కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయమై అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితులు దేవ్, మల్లేశ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని మహేశ్వరం కోర్టులో హాజరుపర్చగా వాదనల అనంతరం న్యాయమూర్తి.. నిందితులకు రిమాండ్ నిమిత్తం జైలుకు పంపిచారు. వారిని చర్లపల్లి జైలుకు తరలించామని ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.



నిందితులు దేవ్



మల్లేశ్

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కుల్కచర్ల: చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వీరాపూర్‌కి చెందిన వెంకటమ్మ(70).. చౌడాపూర్‌లో బుధవారం జరుగుతున్న సంత(అంగడి)కి వెళ్లింది. ఈక్రమంలో ఎండ వేడిమిని తట్టుకోలేక స్పృహ కోల్పోయి పడిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వెంకటమ్మను కుల్కచర్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకవెళ్లగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం మొదట మహబూబ్ నగర్‌కు, అనంతరం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి వెంకటమ్మ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సత్యసీలారెడ్డి తెలిపారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు వసతుల కల్పనపై ఆరా తీశారు. ఈ మేరకు గంథ్ర పాలకుడిని అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమయిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సరిపడా తాగునీరు, ఇంటర్‌నెట్, కంప్యూటర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న గుట్ట పైన ఎక్లాస్ఖాన్‌పేట గ్రామానికి చెందిన వెంకటయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తిమ్మాజిపేట మండలం బాజీపూర్ గ్రామానికి చెందిన జీనుకుంట్ల ప్రశాంత్‌లు అనుమతులు లేకుండా కంప్రెషర్‌తో బండలను బ్లాస్టింగ్ చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. విచారణ అనంతరం ఇరువురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

స్వార్థంతోనే పార్టీని వీడారు

పహాడీషరీఫ్: బీఆర్ఎస్ నాయకులు స్వార్థం కోసం కాంగ్రెస్‌లో చేరారని, వారి తీరు దివాల కోరుతనానికి నిదర్శనమని జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫొద్దీన్ హమీద్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌లు పేర్కొన్నారు. శుక్రవారం సాదత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎన్నో నిధులు విడుదల చేయించారన్నారు. రూ.400 కోట్ల నిధులతో మంచినీటికి సంబంధించిన రిజర్వాయర్లు, పైప్‌లైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. పార్టీలో సముచిత స్థానం కల్పించినప్పటికీ, కొందరు నాయకులు పార్టీని వీడడం బాధాకరమన్నా రు. ఈ కార్యక్రమంలో అంజద్ ఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, షాకీర్, అబ్దుల్లా గాలిబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో బెంగుళూర్ నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిచేందుకు ప్రయత్నిస్తూ చిక్కాడు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ శుక్రవారం కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు చెందిన జయచంద్ (26) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన అతను ఎస్‌ఆర్‌నగర్‌లో ఓ లాడ్జిని నిర్వహించి అప్పుల పాలయ్యాడు. అనంతరం ఓ సంస్థలో ఉద్యోగం చేశాడు. జీతం చాలక పోవడంతో ఇసుక రవాణా దందా నిర్వహించాడు. అప్పులు పెరిగిపోవడంతో పాటు గంజాయి, మత్తు మందులకు అలవాటు పడ్డాడు. బెంగుళూర్‌లో ఓ వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తాడని తెచ్చుకొని నగరంలో విక్రయిస్తే మంచి లాభాలు ఉంటాయని ఓ స్నేహితుడు సలహా ఇచ్చాడు. దీంతో బెంగళూరు వెళ్లిన జయచంద్ 2 గ్రాములు మత్తు పదార్థాన్ని తీసుకొచ్చాడు. దానిని తానే వినియోగించాడు. గత నెల 26 మరోసారి బెంగుళూర్‌కు వెళ్లి 20 గ్రాముల డ్రగ్స్ తీసుకొచ్చాడు. 5 గ్రాములు తాను వాడుకుని 15 గ్రాములను విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి సన్‌సిటీలోని నివాసంలో మత్తు పదార్థాన్ని దాచినట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేసి జయచంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 15 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కాల్ డేటా ఆధారంగా బెంగుళూర్‌లో ఎవరు విక్రయించారు... ఎవరెవరికి విక్రయించారో పూర్తి వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం, సోలిపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి జనార్దన్‌రెడ్డి(68), జానమ్మ దంపతులు శంషాబాద్‌లోని కుమార్తె ఇంటికి వచ్చారు. శుక్రవారం స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు జానమ్మ బస్సులో బయలుదేరగా, జనార్దన్‌రెడ్డి స్కూటీపై వెళ్తున్నాడు. మార్గ మధ్యలో మదన్‌పల్లి శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొంది. తీవ్ర గాయాలైన జనార్దన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

హుడాకాంప్లెక్స్: కార్యకర్తలు సమష్టిగా పనిచేసి చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సరూర్‌నగర్ లోక్‌సభ ఇన్‌చార్జి శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ పార్టీ కార్యాలయంలో పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. అనంతరం కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 15వేల మెజారిటీ లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ కన్వీనర్ ఆకుల అంజన్‌కుమార్, కో కన్వీనర్ జైన్‌బాబు, కాటమరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్